క్లుప్తంగా

నేడు బీఎస్ఎన్ఎల్ కస్టమర్ మీట్

మధురానగర్(విజయవాడసెంట్రల్): చుట్టుగుంట బీఎస్ఎన్ఎల్ భవన్‌లో సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు బీఎస్ఎన్ఎల్ కస్టమర్ మీట్ నిర్వహించనున్నట్లు ఆ సంస్థ విజయవాడ బిజినెస్ ఏరియా ప్రిన్సిపాల్ జనరల్ మేనేజర్ ఎల్.శ్రీను ఆదివారం తెలిపారు. ఈ మీట్‌లో బీఎస్ఎన్ఎల్ వినియోగదారుల సేవ, బిల్లింగ్ సంబంధిత సమస్యలను నేరుగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సత్వర పరిష్కారం పొందవచ్చని తెలిపారు.

అలరించిన సంగీత కచేరీ

విజయవాడ కల్చరల్: విశ్వావసు నామసంవత్సర దసరా మహోత్సవాల సందర్భంగా ఏలూరు రోడ్డు సీతారామపురం సత్యసాయిబాబా మందిరంలో ఆదివారం యువ కళాకారులు ప్రదర్శించిన శాస్త్రీయ సంగీత కచేరీ ఆకట్టుకుంది. యువ కళాకారుడు వైఎస్‌కే సంతోష్ తమన్ గంగణపతి. సుబ్రహ్మణ్య స్వామిని కీర్తిస్తూ శ్రీ సుబ్రహ్మణ్య, మరుగేలరా ఓ రాఘవా, ధిల్లానా, ఆది మూలమే మాకు తదితర కీర్తనలను ఆలపించారు. వయోలిన్‌పై వైఎస్ వీఎస్ హర్ష, మృదంగంపై సాత్విక్ సహకరించారు. సాయి సంస్థల నిర్వాహకులు కళాకారులను సత్కరించారు.

ఘనంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

విజయవాడ కల్చరల్: శారదా చంద్రమౌళీశ్వర, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం, లబ్బీపేట శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం నాటి కార్యక్రమంలో ఉత్సవ మూర్తులకు చతుర్దశ కలశ స్థాపన, నిత్యహోమం, స్వామికి ఎదుర్కోలు సంవాదం, అరుణ పారాయణం, శ్రీవారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. దసరా మహోత్సవాల్లో భాగంగా శారదాదేవి మహాచండిగా దర్శనమిచ్చింది. ఆలయ నిర్వాహకులు డాక్టర్ రామ్మోహనరావు, మేనేజర్ శర్మ నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా ధూళిపాళ శివరామకృష్ణ భక్త శిరియాళ కథను గానం చేశారు.

సాహిత్య సేవా సంస్థ కార్యవర్గం ఎన్నిక

విజయవాడ కల్చరల్: ప్రముఖ ఎక్స్‌రే సాహిత్య సేవా సంస్థకు 2025–2026 సంవత్సరానికి గానూ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి బోడి ఆంజనేయరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యక్షుడిగా కొల్లూరి, ప్రధాన కార్యదర్శిగా బోడి ఆంజనేయరాజు, కోశాధికారిగా సీహెచ్‌వీ సుబ్బయ్య తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. వచ్చే నెల 26 వ తేదీన నగరంలో జరిగే వార్షికోత్సవ సభలో ప్రముఖ సినీ హీరోలు పాల్గొంటారని ఆయన తెలిపారు.

సేవాగుణం అలవర్చుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ తమకు తోచినంతలో సేవ చేయటం అలవర్చుకోవాలని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వీవీపీఎస్ ఆంజనేయులు సూచించారు. స్థానిక మధురానగర్ నేతాజీకాలనీ శ్రీ అంకమ్మతల్లి శక్తి పీఠం సమీపంలో ఆదివారం సీవీఆర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం, పేద విద్యార్థికి సైకిల్ పంపిణీ కార్యక్రమం జరిగింది. సెకండ్ వైస్ గవర్నర్ శ్రీనివాసరెడ్డి, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు లక్ష్మణ, సెక్రటరీ వెంకటేశ్వరరావు, కోశాధికారి సునీత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా షిర్డీ సాయినాథుని పుణ్యతిథి మహోత్సవాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రా షిర్డీ ముత్యాలంపాడు శ్రీషిర్డీసాయిబాబా మందిరంలో సాయినాథుని 107వ పుణ్యతిథి మహోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా బాబాకు క్షీరం, కొబ్బరినీటితో అభిషేకం చేశారు. లోక కల్యాణార్థం మందిర గౌరవాధ్యక్షులు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి దంపతులు వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ సాయినాథ, నవగ్రహ హోమం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, సాయంత్రం లలితా సహస్రనామ, లక్ష్మీసహస్రనామ పారాయణం జరిగింది. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమాలను మందిర అధ్యక్షులు పొన్నలూరి లక్ష్మణరావు, కోశాధికారి మండలపర్తి సత్యశ్రీహరి, లఖంరాజు సునీత, ఆలయకమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

వృద్ధులను ఆదరించండి

మధురానగర్(విజయవాడసెంట్రల్): వృద్ధులను ఆదరించటం ప్రతిఒక్కరి సామాజిక బాధ్యత అని ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, గద్దే రామ్మోహన్‌రావు కొనియాడారు. వృద్ధుల దినోత్సవం పురస్కరించుకుని వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అరవింద్ ఉషాకటారియా, రోహిత్ సంగీత కటారియా సహకారంతో దుర్గాపురం విజయ్‌నర్సింగ్ కళాశాల్లో ఆదివారం శతాధిక వృద్ధులను సత్కరించారు. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్, వైస్ చైర్మన్ తేజ్‌రాజ్ సోలంకీ, ట్రస్టీలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రస్తుత సమాజంలో యువత ఆధ్యాత్మికతను అలవర్చుకుంటే తమ జీవితాలు ఇతరులకు ఆదర్శంగా ఉంటాయని ఆల్ ఇండియా బీసీటీసీ జనరల్ సెక్రటరీ రెవరెండ్ మంగలపూడి జోసఫ్ అన్నారు. సింగ్‌నగర్‌లోని ఇమ్మానుయేల్ బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో అక్టోబర్ రెండో తేదీన చేపట్టనున్న యూత్ కాన్ఫరెన్స్ కార్యక్రమంపై సింగ్‌నగర్‌లో ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీస్తు తన జీవితంలో యవ్వనప్రాయ దశలో ఎలా నడుచుకోవాలో ఆచరించి సమస్త మానవాళికి చూపారన్నారు. సంఘ సెక్రటరీ రాజేంద్రప్రసాద్, ప్రెసిడెంట్ కోలా శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



దేవీనగర్‌లో శ్రీలలిత సుందరీదేవిగా అమ్మవారి దర్శనం



శ్రీఅంకమ్మతల్లి శక్తిపీఠంలో అమ్మవారు



శ్రీదత్తసాయి శివకామేశ్వరి పీఠంలో మహాలక్ష్మీదేవిగా అమ్మవారు



మధురానగర్ మెయిన్‌రోడ్డులో..

జగన్మాతా.. నమోస్తుతే..

శ్రీమహాచండిగా పూజలందుకున్న అమ్మవారు

మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారిని శ్రీమహాచండీ దేవిగా అలంకరించి పూజలు చేశారు. అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ముత్యాలంపాడులో..

ముత్యాలంపాడు శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని, ముత్యాలంపాడు గ్రామదేవత శ్రీ గంగానమ్మ ఆలయంలో అమ్మవారిని శ్రీమహాచండీ దేవిగా అలంకరించి పూజలు, కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమాలను అభివద్ధి కమిటీ కార్యదర్శి మందపాటి యుగంధర్ వర్మ పర్యవేక్షించారు.

శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో..

శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో అమ్మవారిని శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యంలో శ్రీ మహాలక్ష్మీదేవిగా అలంకరించి పూజలు చేశారు. లోక కళ్యాణార్థం విశేషంగా హోమం నిర్వహించారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకులు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు. బావాజీపేట నాలుగోలైనులో శ్రీదేవీ ధర్మ ప్రచారపరిషత్ బచ్చు మాధవీమురళీకష్ణ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని శ్రీమహాచండీ దేవిగా అలంకరించి పూజలు చేశారు. దేవీనగర్‌లో ఆదిశక్తి సేవా సమితి ఆధ్వర్యంలో, మధురానగర్ మెయిన్ రోడ్డులో అమ్మవారిని శ్రీమహాచండీ దేవిగా అలంకరించి సామూహిక కుంకుమార్చనలు చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. అలాగే మధురానగర్ నేతాజీ కాలనీ శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో అమ్మవారిని శ్రీమహాచండిగా అలంకరించి పూజలు చేశారు. పీఠం వ్యవస్థాపకులు అన్నాబత్తుల శరాబందీరావు పర్యవేక్షించారు.



మధురానగర్ మెయిన్ రోడ్డులో సామూహిక కుంకుమార్చనలు

గద్దే వెంకట్రామయ్యనగర్‌లో..

జీవీఆర్‌నగర్‌లో అమ్మవారిని శ్రీమహాచండిగా అలంకరించి పూజలు చేశారు. కార్యక్రమాలను జీవీఆర్‌నగర్ భక్తబందం సభ్యులు గద్దే శ్రీను, నూతక్కి శ్రీను పర్యవేక్షించారు.

ఘనంగా దసరా ఉత్సవాలు



మహా చండీదేవి అవతారం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నర్‌పేటలోని చల్లపల్లి బంగ్లా సమీపంలోని శ్రీ కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణదేవి దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అన్నపూర్ణాదేవి అమ్మవారు మహాచండీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈఓ సీతారామయ్య,ఆలయ ధర్మకర్తలు భక్తులకు ప్రత్యేకఏర్పాట్లు చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు.





భక్త జన గిరి

ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ సన్నిధిలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజైన ఆదివారం అమ్మవారు శ్రీమహాచండీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్నాటక, తమిళనాడు, ఒడిశా నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాల్లో భక్త జన కోలాహలం నెలకొంది. సాయంత్రం నిర్వహించిన ఆది దంపతుల నగరోత్సవం, కళాకారుల నృత్యాలు భక్తులను అలరించాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

విజేతలకు బహుమతులు ప్రదానం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో దసరా ఉత్సవాల సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ క్రీడాంశాల్లో విజేతలకు ఆదివారం బహుమతి ప్రదానం చేశారు. డ్రాయింగ్ పోటీల్లో సబ్ జూనియర్స్ విభాగంలో తాన్యశ్రీ, రామ ప్రియ, కీర్తి మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. జూనియర్స్ విభాగంలో పి. లక్ష్మి, వాగ్దేవి, సత్యవతి వరుసగా మూడు స్థానాల్లో నిలిచారు. విభాగంలో సీనియర్స్ మొదటి మూడు స్థానాలను రాజేశ్వరి, ప్రణీత్, దినేష్ కార్తీక్ దక్కించుకున్నారు. డ్యాన్స్ పోటీల్లో కీర్తన శ్రీ, వైష్ణవి, సాత్విక, జ్ఞానేశ్వరి, భువన జ్ఞాపికలు అందుకున్నారు. జానపద గేయాల పోటీల్లో వాగ్దేవి, ఉమా, దుర్గ భవాని బహుమతులు గెలుచుకున్నారు. విజేతలకు ఫ్లోర్ లీడర్ నెలిబండ్ల బాలస్వామి బహుమతులు అందజేశారు. గ్రంథాలయ అధికారి కె.రమాదేవి, డ్రాయింగ్ టీచర్ స్వాతి పూర్ణిమ, దూరదర్శన్ యాంకర్ చంద్రిక, సిబ్బంది నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మహిళలు ఆర్థిక అక్షరాస్యత కలిగి ఉండాలని వక్తలు పేర్కొన్నారు. ఆదివారం గాంధీనగర్‌లోని ఐలాపురం రామా ఫంక్షన్ హాల్లో శుభమ్ హౌసింగ్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కో లిమిటెడ్ ఆధ్వర్యంలో మహిళల కోసం ఆర్థిక సాక్షరత శిబిరం నిర్వహించారు. శిబిరంలో మార్కెటింగ్ నిపుణులు పాల్గొని మహిళలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. మార్కెటింగ్ మేనేజర్ కె.ఉమాశంకర్ రాజు, కేకే ఏజెన్సీస్ కేఎస్టీ కుమార్ పాల్గొన్నారు.

పరదేశిబాబు గ్రంథాలు ఆవిష్కరణ

విజయవాడ కల్చరల్: విశ్రాంత అధ్యాపకుడు, భాషావేత్త డాక్టర్ జంధ్యాల పరదేశిబాబు రచించిన గ్రంథాలను ముత్యాలంపాడు ఆలయ సముదాయం చైర్మన్ డీ నరసింహరాజు ఆదివారం ఆవిష్కరించారు. పరదేశిబాబు రచనలు రామాయణంలో రమణీయ ఘట్టాలు, శ్రీవెంకటేశ్వర వైభవం, బుద్ధుని బోధనలు, మహతీ శంకర్ పద్య మంజూష గ్రంథాలను ఆవిష్కరించారు. అనంతరం కళాపోషకుడు చెట్లపల్లి మారుతీ ప్రసన్న పరదేశిబాబును సత్కరించారు.

తోటివారికి సాయం చేయండి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతిఒక్కరూ తోటివారికి సాయం చేయాలని బేతేలు బైబిలు కాలేజీ వ్యవస్థాపక డైరెక్టర్ రెవరెండ్ నల్లూరి జయకుమార్ బాబు అన్నారు. బేతేలు మినిస్ట్రీస్, సోవర్ మినిస్ట్రీస్, బేతేలు బైబిలు కాలేజీ ఆధ్వర్యంలో ఆదివారం బేతేలు ప్రార్థన మందిరంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ వంతు బాధ్యతగా సంఘస్తులు, పేదలకు ఉచితంగా నేత్ర వైద్యపరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు చేయించనున్నట్లు పేర్కొన్నారు. తొలుత ప్రముఖ నేత్ర వైద్యనిపుణులు డాక్టర్ డాక్టర్ సల్మాన్‌రాజు వైద్య బృందం ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించారు. సంఘ పెద్దలు యలమర్తి ఆంజనేయులు, నరేంద్ర, విజయకుమారి, కృష్ణ పాల్గొన్నారు.

జాషువా రచనలు స్ఫూర్తిదాయకం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సమాజంలో అంటరాని తనం నిర్మూలనకు, జాతి వివక్షతకు వ్యతిరేకంగా గుర్రం జాషువా రచనలు ఎంతో స్ఫూర్తిదాయకమని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. మహాకవి గుర్రం జాషువా జయంతి కార్యక్రమం సింగ్‌నగర్ ఆంధ్రప్రభకాలనీలోని జనహిత సదనంలో ఆదివారం జరిగింది. తొలుత విష్ణుతోపాటు వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు, నాయకులు జాషువా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్లు శర్వాణీమూర్తి, ఇసరపు దేవి, వైఎస్సార్ సీపీ నాయకులు కాలే పుల్లారావు, ఒగ్గు గవాస్కర్, రవిచంద్ర, అలంపూరు విజయ్, యరగొర్ల శ్రీరాములు, పెద్దిరెడ్డి శివారెడ్డి, ఎస్‌డి బాబు, అక్బర్, పేరం త్రివేణి రెడ్డి, ఝాన్సీరాణి ప్రేమ్, కనకారావు, మాతామహేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల కళాశాల్లో..



గుర్రం జాషువా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మల్లాది విష్ణు, శ్రీశైలజ

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలోని గురుకుల కళాశాల్లో ఆదివారం గుఱ్ఱం జాషువా జయంతి పురస్కరించుకుని 'విశ్వనారుడు జాషువా కవిత్వతత్త్వం' అనే అంశంపై అతిథి ఉపన్యాసం జరిగింది. అంతర్జాలంలో జరిగిన అతిథి ఉపన్యాస కార్యక్రమంలో చీరాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకుడు డాక్టర్ కట్టిపోగు సురేష్ కుమార్ ఉపన్యసించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వల్లూరు నీరజ, డాక్టర్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జంతువులకు రేబిస్ వ్యాక్సిన్ తప్పనిసరి

మధురానగర్(విజయవాడసెంట్రల్): జంతువులకు తప్పనిసరిగా రేబిస్ వ్యాక్సిన్ వేయించాలని పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కె.హనుమంతరావు పేర్కొన్నారు. స్థానిక ముత్యాలంపాడు గ్రామీణ పశువైద్యశాల్లో ప్రపంచ రేబిస్ దినోత్సవం పురస్కరించుకుని పశుసంవర్ధక శాఖ, వీఎంసీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం జంతువులకు రేబిస్ వ్యాక్సినేషన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంతువులు కరచినప్పుడు లేదా గోటితో గీరినప్పుడు రేబిస్ వ్యాధి జంతువుల నుంచి మనుషులకు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. అనంతరం పెంపుడు జంతువులతో పాటు వీధి కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాక్సిన్ వేశారు. పశుసంవర్ధక శాఖ విజయవాడ డివిజన్ డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కే. చంద్రశేఖర్, నున్న ఏరియా వెటర్నరీ హాస్పిటల్ అసిస్టెంట్ డైరెక్టర్, డాక్టర్ డి. రాజశేఖర్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, డాక్టర్. కె వి రామకృష్ణ, వీఎంసీ వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ సోమశేఖరరెడ్డి ముఖ్య అతిథులుగా మాట్లాడారు. అనంతరం కుక్కలకు వ్యాక్సిన్ వేశారు. ముత్యాలంపాడు గ్రామీణ పశువైద్యశాల వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్, డాక్టర్ రామకృష్ణ, కల్యాణ్ చక్రవర్తి, సురేష్, సౌజన్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.



పెంపుడు జంతువులకు రేబిస్ వ్యాక్సిన్ వేస్తున్న డాక్టర్ హనుమంతరావు

నయనానందకరం.. నృత్య ప్రదర్శన

విజయవాడ కల్చరల్: దేవదాయ శాఖ, శ్రీదుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో శరన్నవరాత్రుల సందర్భంగా కనకదుర్గానగ్‌లోని కళావేదికపై ప్రదర్శిస్తున్న సంప్రదాయ నృత్యాలు ఆదివారం నయనానందకరంగా సాగాయి. భక్తి రంజని కార్యక్రమంలో భాగంగా ఎస్.ప్రసాద్, ఎ.అమృత, బుర్రా నీల కంఠశాస్త్రి, లక్ష్మీమోహనరావు, ఫణీంద్ర కుమార్, శిఖామణి వాగ్గేయకార కృతులను ఆలపించారు. సంప్రదాయ నృత్య కార్యక్రమంలో భాగంగా కే కృష్ణవేణి, మాగలూరి త్రినాథాచారి, మోహన త్రివేణి, ఎం.ప్రణీత్, అరుణ్ కల్యాణి, చస్మిత, సురేష్, శ్రీనివాస్, ప్రియా సతీష్, విజయమాధవి, హైదరాబాద్‌కు చెందిన లక్ష్మీదుర్గ, గౌరీనాగ ప్రియ, శివసాయిలు కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్యాలను ప్రదర్శించారు. వాగ్గేయకారులు త్యాగరాజ స్వామి, రామదాసు, అన్నమయ్య, భారతీ తీర్థ స్వామి, మైసూర్ వాసుదేవాచారి కీర్తనలతోపాటు పలు సంప్రదాయ పాటలకు నృత్యాలను ప్రదర్శించారు.



నృత్య ప్రదర్శనలో చిన్నారులు

భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భగత్‌సింగ్ స్ఫూర్తితో ప్రజావ్యతిరేక పాలనపై పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐవైఎఫ్ జాతీయ మాజీ కార్యదర్శి ఈశ్వరయ్య అన్నారు. ఏలూరు రోడ్డు విజయటాకీస్ సెంటర్ తమ్మారెడ్డి భవన్ వద్ద ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో భారత స్వాతంత్ర్యోద్యమ యువతార భగత్‌సింగ్ జయంతి కార్యక్రమం జరిగింది. ఏఐవైఎఫ్ నాయకులు భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎం.యుగంధర్, నగర అధ్యక్షులు కంచర్ల భార్గవ్, ప్రధాన కార్యదర్శి లంకా గోవిందరాజులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మధురానగర్‌లో..

మధురానగర్(విజయవాడసెంట్రల్): భగత్‌సింగ్ స్ఫూర్తితో దేశానికి సేవ చేయాలని సత్యనారాయణపురం పీఎస్ ఎస్ఐ సౌజన్య సూచించారు. స్థానిక మధురానగర్ మెయిన్ రోడ్డులో ఆదివారం భగత్‌సింగ్ సేవాసమితి ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జయంతి జరిగింది. అనంతరం పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

నవయుగ కవితా చక్రవర్తి గుర్రం జాషువా

విజయవాడ కల్చరల్: నవయుగ కవితా చక్రవర్తి గుర్రం జాషువా అని ప్రముఖ న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. తెలుగు కళారత్నాలు ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదకపై ఆదివారం జాషువా జయంతి వేడకులు సినీ సంగీత విభావరి, జాషువా స్మారక పురస్కార సభను నిర్వహించారు. అనంతరం న్యాయవాది గుప్తాను నిర్వాహకులు సత్కరించారు. సాహితీవేత్త మురళీకృష్ణ, నిర్వాహకులు రత్నం, ఉషారాణి పాల్గొన్నారు.

'శ్రీరామరక్ష'గా వైఎస్సార్ సీపీ డిజిటల్ ప్లాట్‌ఫాం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): అక్రమ కేసుల్లో ఇబ్బందులు పడుతున్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, సోషల్ మీడియా సభ్యులకు పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన డిజిటల్ ప్లాట్‌ఫాం శ్రీరామరక్షగా నిలబడుతుందని పార్టీ సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. సింగ్‌నగర్ ఆంధ్రప్రభకాలనీలోని జనహిత సదనంలో వైఎస్సార్ సీపీ డిజిటల్ ప్లాట్‌ఫాం పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా మల్లాది విష్ణు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైఎస్సార్ సీపీ నాయకులు, సోషల్ మీడియా సభ్యుల మీద దాడులు, అక్రమ కేసులు పెరిగిపోయాయన్నారు. గడిచిన ఏడాదిన్నర కాలంలో ప్రతి నియోజకవర్గంలోనూ దాడులకు పాల్పడడం, సోషల్ మీడియా సభ్యుల మీద అక్రమ కేసులు నమోదు చేయడం ఒక పరిపాటిగా మారిందన్నారు. ఇటువంటి అక్రమ చర్యలకు అడ్డుకట్ట వేయాలనే లక్ష్యంతో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అన్యాయానికి గురికాకుండా ఉండేందుకు పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ ప్లాట్‌ఫాంను ప్రారంభించి, ఒక ఫోన్ నంబర్‌ను కూడా ప్రకటించారన్నారు. కూటమి నాయకులు అధికారాన్ని దుర్వినియోగిస్తూ కార్యకర్తలను, సోషల్ మీడియాను వేధింపులకు గురిచేస్తున్నారో వాళ్లందరినీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత చట్టం ముందు నిలబెట్టి, కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

రెండు రకాలుగా అందుబాటులోకి..

ఈ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను రెండు రకాలుగా అందుబాటులోకి తీసుకువచ్చామని మల్లాది విష్ణు తెలిపారు. ఒకటి 040–491 71718 అనే నంబర్‌కు ఫోన్ చేసి తమ బాధను, తమకు జరిగిన అన్యాయాన్ని తమ వాయిస్ ద్వారా రికార్డ్ చేసుకునే అవకాశం ఉందన్నారు. అలాగే ఇప్పుడు ప్రారంభించిన డిజిటల్ ప్లాట్‌ఫాం ద్వారా తమకు జరిగిన అన్యాయాన్ని తెలియజేయవచ్చన్నారు. వీటిపై రాబోయే రోజుల్లో వైఎస్సార్ సీపీ ఒక నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. రాబోయే కాలంలో జగన్ 2.0 ప్రభుత్వం కార్యకర్తల ద్వారానే నడిపిస్తుందనే విషయాన్ని ఇప్పటికే పలు సమావేశాల్లో పార్టీ అధినేత స్పష్టం చేశారని పేర్కొన్నారు. కార్యకర్తలకు అండగా వైఎస్సార్ సీపీ పటిష్ట ప్రణాళికతో అడుగులు వేస్తుందని, కార్యకర్తలంతా ధైర్యంగా ఉండాలన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరించిన మల్లాది విష్ణు, శ్రీశైలజ, కార్పొరేటర్లు, నాయకులు

పార్టీలో ప్రతి వ్యక్తికీ రక్షణ

డెప్యూటీ మేయర్ అవుతూ శ్రీ శైలజారెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీతో సంబంధం ఉన్న ప్రతి వ్యక్తికీ రక్షణ కల్పించాలనే ప్రధాన ధ్యేయంతో మాజీ సీఎం, పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ డిజిటల్ ప్లాట్‌ఫాం, ఫోన్ నంబర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. కూటమి ప్రభుత్వంలో అన్యాయానికి గురైన బాధితులకు మన ప్రభుత్వం వచ్చిన తరువాత జగనన్న తప్పక న్యాయం చేస్తారని తెలిపారు. కార్పొరేటర్లు శర్వాణీమూర్తి, ఇసరపు దేవి, వైఎస్సార్ సీపీ నాయకులు కాలే పుల్లారావు, ఒగ్గు గవాస్కర్, రాష్ట్ర విద్యార్థి విభాగం అధ్యక్షులు రవిచంద్ర, అలంపూరు విజయ్, యరగొర్ల శ్రీరాములు, పెద్దిరెడ్డి శివారెడ్డి, ఇసరపు రాజు, ఎస్‌డి బాబు, అక్బర్, పేరం త్రివేణి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): 26వ డివిజన్ చుట్టుగుంట అల్లూరి సీతారామరాజు వంతెన సమీపంలో పీ వంశీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యసిద్ధి గణపతి నృత్య కళాపీఠం వేడుకల్లో భాగంగా చిన్నారులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త మల్లాది విష్ణు ముఖ్య అతిథిగా పాల్గొని డెప్యూటీ మేయర్ అవుతు శ్రీ శైలజరెడ్డితో కలిసి కళాకారులకు జ్ఞాపికలను పంపిణీ చేశారు. నాయకులు రాఘవ, కోలా నాగాంజనేయులు, దుర్గారావు, అలుగోలు కరుణాకర్ పాల్గొన్నారు

● సంప్రదాయ నృత్య వైభవం

విజయవాడ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, నాటక అకాడమీ, విజయవాడ ఉత్సవ్ కమిటీ ఆధ్వర్యంలో నగరంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు ఏడో రోజుకు చేరుకున్నాయి. ఆదివారం నాటి కార్యక్రమంలో యామినీ సిస్టర్ కూచిపూడి సంప్రదాయంలో ప్రదర్శించిన అంశాలు ఆకట్టుకున్నాయి.

తుమ్మలపల్లి వారి కళాక్షేత్రంలో..

హైదరాబాద్‌కు చెందిన స్నేహలత బృందం కూచిపూడి నృత్యాలను వయోలిన్ విద్వాంసురాలు విష్ణుభొట్ల కృష్ణవేణి వయోలిన్ కచేరి, వెంకట్ మ్యాజిక్ షో ప్రదర్శించారు. కథక్ నృత్య కళాకారిణి లేఖ్యాభరణి, వెంకట్ ప్రదర్శించిన వీరనాట్యం, వెంకటేశ్వరరావు బృందం తోలు బొమ్మలాట అంశాలు ఆకట్టుకున్నాయి.